నేడు సైదాబాద్‌లో రక్తదాన శిబిరం

సైదాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్‌లోని ఎలైట్ ఫంక్షన్ హాల్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం 10 గంటలకు సైదాబాద్, మలక్‌పేట డివిజన్ల పోలీసుల ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేశామని చెప్పారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదాన శిబిరంలో పాల్గొని విజయవంతం చేయాలని సీఐ కోరారు.

శబరిగిరీశుడి ఆశీస్సులు అందరిపై ఉండాలి

● కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): శబరిమల అయ్యప్పస్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలని భగవంతుడిని ప్రార్థించినట్లు జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. డివిజన్ పరిధి సహారా రోడ్డులోని అయ్యప్ప ఆలయంలో ఆదివారం అయ్యప్ప మాలధారులకు నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ రూ.25వేల విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రసన్నప్రియ అయ్యప్ప భక్త సమాజం సభ్యులు, స్థానికులు కొప్పుల జనార్దన్‌రెడ్డి, శంకరయ్య, వెంకట్‌రెడ్డి, కుమార్, రంగారెడ్డి పాల్గొన్నారు.



వృద్ధులతో సురక్ష సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపీశంకర్‌యాదవ్

వృద్ధులకు ఉచిత కంటి ఆపరేషన్లు

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సురక్ష సేవా సంఘం ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచిత కంటి ఆపరేషన్లు చేయించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపీశంకర్‌యాదవ్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, ధనలక్ష్మి ఆప్టికల్స్ పుష్పగిరి కంటి ఆస్పత్రి సహకారంతో 35 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయించినట్లు తెలిపారు. కంటి ఆపరేషన్ అవసరమున్న వారు సురక్ష సేవా సంఘాన్ని సంప్రదించాలని, ఇప్పటి వరకు 465 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించామని చెప్పారు. కార్యక్రమంలో ధనలక్ష్మి ఆప్టికల్స్ ఆప్టోమెట్రిస్ట్ రాజేశ్‌గౌడ్, యాదగిరి, యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

కోనేరు క్లీనింగ్ పనుల పరిశీలన



కోనేరు క్లీనింగ్ పనులను పరిశీలిస్తున్న ఆలయ చైర్మన్ సత్యనారాయణరెడ్డి

చంపాపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో ఆదివారం కోనేరును శుభ్రం చేశారు. క్లీనింగ్ పనులను ఆలయ చైర్మన్ ఈదులకంటి సత్యనారాయణరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోనేరులో పేరుకపోయిన చెత్త, మురికిని తొలగిస్తున్నామని చెప్పారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆలయానికి వచ్చే భక్తులకు దీపారాధన, ఛట్ పూజల కోసం కోనేరును సిద్ధం చేయాలని సిబ్బందికి సూచించారు. కోనేరులోని నీటిని పూర్తిగా తొలగించి మెట్లకు రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించాలని చైర్మన్ కోరారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శ్రీనివాస్, ఆలయ సిబ్బంది వెంకటయ్య, ప్రసాద్, వేణుగోపాల్ పాల్గొన్నారు.



ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ కృష్ణయ్యగౌడ్

ప్రతీ పౌరుడు పోలీసే: ఏసీపీ కృష్ణయ్యగౌడ్

మన్సూరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతీపౌరుడు యునిఫాం లేని పోలీసేనని, నేరాల నియంత్రణకు అందరూ కృషి చేయాలని ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్యగౌడ్ సూచించారు. నాగోల్ చౌరస్తా వద్ద ఆదివారం 'విజిబుల్ పోలీసింగ్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని, సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాగోల్ సీఐ మహమ్మద్ మక్బూల్‌జానీ, ఎస్ఐ ఉమ, ఏఎస్ఐలు జంగయ్య, వేణుగోపాల్, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.



కమిటీ సభ్యులతో నెమలి అనిల్ కుమార్ తదితరులు

నాగలక్ష్మి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

తార్నాక, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ డివిజన్ నాగలక్ష్మి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని కమిటీ సభ్యులు ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తోట నవీన్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా సింగారి కిషోర్ కుమార్, కోశాధికారిగా మహేష్ కుమార్ ఎన్నియ్యారు. ఎన్నికయిన కమిటీ సభ్యులను గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ నాగలక్ష్మి కాలనీ అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు.

'సత్యాన్వేషి' ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

రవీంద్రభారతి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీ కళానికేతన్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో చిలువేరు రఘురామ్ రచించిన సత్యాన్వేషి పుస్తకావిష్కరణ జరిగింది. ఆదివారం రవీంద్రభారతిలో కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఈ సభకు అతిథులుగా ఆచార్య డి.ఎస్.ఎన్ మూర్తి, నటరాజ శాక్య బుద్ధపథగామి, డా.కె.జి.వేణు, ఈమని శివనాగిరెడ్డి, పాలకుర్తి మధుసూదనరావు, శ్రీనివాసరెడ్డి తదితరులు హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించి రచయితను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సత్యాన్వేషి పేరిట నాటక రూపాన్ని పుస్తకంగా తీసుకురావడం సంతోషకరమని అన్నారు. సిద్ధార్థుడి మహాభినిష్క్రమణ గురించి రచించిన తీరు అభినందనీయమని అన్నారు. ఇలాంటి రచనలు మరిన్న రావాలని ఆకాంక్షించారు.

ఘనంగా శ్రీకీర్తన సంగీత అకాడమీ వార్షికోత్సవం

రవీంద్రభారతి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ సంగీత కచేరీలతో చిన్నారి కళాకారులు ఓలలాడించారు. ఆదివారం శ్రీకీర్తన సంగీత అకాడమీ 5వ వార్షికోత్సవం నిర్వహించారు. భారత్ వికాస్ పరిషత్తులో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భాష్యం శ్రవణ్‌కుమార్, సాధనా నరసింహాచార్యలు హాజరై చిన్నారి కళాకారులను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చిన్నారి దశ నుంచే శాస్త్రీయ కళల పట్ల మక్కువ పెంచుకోవడం అభినందనీయమని అన్నారు.

కాంగ్రెస్‌తోనే ఎల్బీనగర్ అభివృద్ధి

● టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్



మాట్లాడుతున్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే ఎల్బీనగర్ నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. వనస్థలిపురం డివిజన్ శ్రీనివాసపురం కాలనీలో రూ.20లక్షల వ్యయంతో నూతనంగా చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆదివారం రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎల్బీనగర్ నియోజకవర్గం నివాసయోగ్యమైన ప్రాంతమనీ, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ ప్రాంతంలో పుట్టి పెరిగిన వ్యక్తిగా ఎల్బీనగర్ నియోజకవర్గంలోని సమస్యలను తన బాధ్యతగా పరిష్కరిస్తానన్నారు. నియోజకవర్గంలో ఏ సమస్యలు లేవని స్థానిక ఎమ్మెల్యే చెబుతున్నాడని, రోడ్డు, డ్రైనేజీ, వరదముంపు, మంచినీటితో పాటు అనేక సమస్యలు ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే ఎల్బీనగర్‌కు నిధులు భారీగా వస్తున్నాయని, జీహెచ్ఎంసీలోనే వనస్థలిపురం డివిజన్‌కు అత్యధికంగా నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేయిస్తున్నట్లు మధుయాష్కీగౌడ్ పేర్కొన్నారు. కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, వనస్థలిపురం డివిజన్‌లోని దీర్ఘకాలిక సమస్యలను శాశ్వతంగా పరిష్కరించి ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతానన్నారు. మధయాష్కీగౌడ్ సహకారంతో త్వరలోనే సీఎంను కలిసి వనస్థలిపురం హుడా ఆడిటోరియం ప్రాంగణంలో మినీ రవీంద్ర భారతి నిర్మాణంతో పాటు మౌలిక వసతుల కల్పనకు మరింతగా కృషి చేస్తానని ఆయన ప్రజలకు హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రామారావు, అశోక్‌గౌడ్, కర్మన్‌ఘాట్ ఆంజనేయస్వామి ఆలయ డైరెక్టర్ కవిత, నాగరాజు, కాలనీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి, కోశాధికారి రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ సేవలు అభినందనీయం

● మాజీ మేయర్ పారిజాతారెడ్డి



ఎన్ఎస్ఎస్ శిబిరంలో శ్రమదానం చేస్తున్న మాజీ మేయర్ పారిజాతారెడ్డి, బాబు తదితరులు

సరూర్‌నగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పచ్చదనం, పరిశుభ్రత కోసం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు చేస్తున్న కృషి అభినందనీయమని బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. బడంగ్‌పేట్‌లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్-1, యూనిట్-2 ఆధ్వర్యంలో ఆదివారం నాదర్‌గుల్ 8వ డివిజన్‌లోని అంబేడ్కర్‌నగర్ బస్తీలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘం పీఏసీ చైర్మన్ బంగారి బాబుతో కలిసి పారిజాతారెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులతో కలిసి ఆమె పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఎన్ఎస్ఎస్ విభాగం నిర్వహించే ప్రత్యేక శిబిరాలతో మారుమూల గ్రామాల్లోని ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన ఏర్పడి, వారిలో చైతన్యం వస్తుందని అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులు బస్తీలకు వచ్చి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమని, వారిని ప్రోత్సహిస్తున్న అధ్యాపకులు, కాలేజీ సిబ్బంది ప్రశంసనీయులని కొనియాడారు. కార్యక్రమంలో కాలేజీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా.జ్యోతి, డా.వెంకట్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు తోట శ్రీధర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఇంద్రసేన, సునీతాశ్రీకాంత్‌గౌడ్, సంతోషిశ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బ్లడ్ బ్యాంకు కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జీవన్‌రెడ్డి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

నాణ్యతా ప్రమాణాలతో సీసీ రోడ్ల నిర్మాణం

హయత్‌నగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలోని బ్లడ్ బ్యాంకు కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం కాలనీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ, భవిష్యత్తును ఆలోచించి నిర్మాణ పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌ను కోరారు. సాధ్యమైనంత త్వరగా సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని, అదే విధంగా కాలనీలోని పెండింగ్ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేస్తానని హామీనిచ్చారు. వీధి దీపాలు లేక ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసులు కార్పొరేటర్‌కు తెలిపారు. స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడి వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, గోవిందాచారి, కాలనీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, గాలయ్యగౌడ్, లింగయ్య, శ్రీశైలంయాదవ్, సుధాకర్‌రెడ్డి, మాధవారెడ్డి, వంశీ, రమేశ్, కరుణాకర్‌రెడ్డి, కృష్ణ, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి: కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

ఎల్బీనగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): లింగోజీగూడ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం లింగోజిగూడ డివిజన్ పరిధిలోని ఓల్డ్‌లింగోజిగూడలో రూ.35 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ, ప్రజలకు ఇబ్బందుల్లేకుండా సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం సహకారంతో డివిజన్‌లో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. రోడ్లపై చెత్త వేయకుండా చూడాలని ఆయన ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు శ్రీను, శ్రీధర్, రాంబాబు, జైపాల్, ప్రసాద్, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

గోవుల రక్షణ అందరి బాధ్యత: కిషన్‌రెడ్డి



విజేతకు నగదు బహుమతి అందజేస్తున్న కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్

రాంనగర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గోవుల రక్షణ గో పరిరక్షకుల బాధ్యత మాత్రమే కాదని మొత్తం సమాజానిదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. భారత్‌లో పెరిగిన జనాభాకనుగుణంగా ఆహార ఉత్పత్తిని పెంచుకోవాలని ఆయన సూచించారు. పాల ఉత్పత్తికి గోవు తప్ప మరో ప్రత్యామ్నాయం లేదన్నారు. తెలంగాణ గోసేవ విభాగం ఆధ్వర్యంలో భారత గోవు పర్యావరణ పరిరక్షణలో శాస్త్రీయ విజ్ఞానం అనే అంశంపై రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన పోటీలో గెలుపొందిన వారికి ఆదివారం నారాయణగూడలోని కేశవమెమోరియల్ కళాశాల ఆవరణలో బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఆర్ఎస్ఎస్ క్షేత్రప్రచారక్ భరత్‌కుమార్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆవు పాలు విశ్వానికే తల్లి అని అన్నారు. పుట్టిన బిడ్డల నుంచి వ్యక్తి అంతిమ సంస్కారం వరకు గోవుల ప్రాధాన్యం ఉంటుందన్నారు. గోవుల పోషణను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక రాయితీలు కల్పిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకుంటూ గోవుల పరిరక్షణ ద్వారా ఆర్థిక ప్రయోజనం పొందాలన్నారు. గ్రామీణ వాతావరణంలో పెరిగిన తనకు గోవుల పరిరక్షణ, వాటి ఆవశ్యకతపై అవగాహన ఉందన్నారు. ఎప్పుడు బిజీగా ఉండే ప్రధాని మోదీ తన నివాసంలో గోవులను పరిరక్షిస్తూ కొంత సమయం కేటాయిస్తారని అన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ, గోవుల రక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. భారతీయ గోవు పరిరక్షణలో శాస్త్రీయ విజ్ఞానంపై రాష్ట్ర వ్యాప్తంగా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తెలంగాణ గోసేవ విభాగం ప్రతినిధి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓయూ గ్రూప్-1, 2 ఉద్యోగులకు సత్కారం



ఉద్యోగులతో ఓయూ వీసీ, ప్రొఫెసర్లు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాలకు ఎంపికైన ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులు, ఉద్యోగులను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం ఆదివారం సత్కరించారు. ఓయూ నుంచి దాదాపు 50 మందికి పైగా ఉన్నత స్థాయి ఉద్యోగాలకు ఎంపికవడం ఆనందంగా ఉందన్నారు. ఉన్నత ఉద్యోగాలు సంపాదించిన వారంతా ప్రజల సమస్యలు పరిష్కరించటంలో సులభపద్ధతులను అన్వేషించాలని సూచించారు. భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా ఉండేలా ఉత్తమ ఉద్యోగులుగా పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాలకు ఎంపికైన ప్రతి ఒక్కరినీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డి, ఓఎస్డీ జితేంద్ర కుమార్ నాయక్, యూజీసీ వ్యవహారాల డీన్ లావణ్యలతో కలిసి ప్రొఫెసర్ కుమార్ మొలుగరం సత్కరించారు. కార్యక్రమంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, అడ్మినిస్ట్రేషన్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కూచిపూడి నాట్యశాస్త్ర సమీక్ష

రవీంద్రభారతి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో సిద్ధనాట్య కళా సమితి ఆధ్వర్యంలో కూచిపూడి నాట్యం సర్టిఫికెట్ పరీక్ష ప్రథమ సంవత్సరం సిద్ధాంతం, ప్రాయోగిక అంశాలపై సదస్సు నిర్వహించారు. వాణీ రమణ స్వాగత ఉపన్యాసంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగు వర్సిటీ రిజిస్ట్రార్ కోట్ల హనుమంతరావు పాల్గొని పలువురు నాట్య గురువులను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గడిచిన నాలుగు దశాబ్దాలుగా ఉన్న సిలబస్‌ను పునఃసమీక్షించి నూతన సిలబస్‌ను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. పరీక్షల నిర్వహణలో, ప్రాయోగిక పరీక్షలలో నాట్య గురువులకు పరీక్ష అధికారులకు మధ్య ఉన్న అపోహలను తొలగించి నిర్దిష్టమైన ప్రణాళికలను త్వరలోనే నిర్మిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ భాగవతులు సేతూరాం, పసుమర్తి శేషుబాబు, పసుమర్తి శ్రీనివాసశర్మ, వేదాంతం సత్య సరసింహశాస్త్రి, శ్రీదేవి, ఎస్.ఉషారాణి, అనిత, తదితరులు పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్ల కోసం

బీసీ విద్యార్థి దీక్ష

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): 42 శాతం బీసీ రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని బీసీ స్టూడెంట్స్ జేఏసీ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీలో నవంబరు 4 నుంచి 8 వరకు బీసీ విద్యార్థి దీక్ష చేపట్టనున్నట్లు జేఏసీ చైర్మన్ కొమ్మనబోయిన సైదులు యాదవ్ పేర్కొన్నారు. ఈ దీక్షకు సంబంధించిన పోస్టర్లను ఓయూలోని ఆర్ట్స్ కాలేజీ ఎదుట జేఏసీ గౌరవ అధ్యక్షులు, సలహాదారులు డాక్టర్ జంపాల రాజేష్, వలిగొండ నరసింహ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ విద్యార్థి దీక్షకు బీసీల్లోని మేధావులు, యువత, విద్యార్థులు, సబ్బండ వర్గాలు విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి జేఏసీ అధ్యక్షులు చేరాల వంశీ, సీనియర్ నాయకులు రంగసాయి బట్టు, మొలుగురి బచ్చయ్య, జేఏసీ వైస్ చైర్మన్, వర్కింగ్ ప్రెసిడెంట్, ప్రధాన కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగి అదృశ్యం



నాగేశ్వర్‌రావు

సరూర్‌నగర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి అదృశ్యమైన సంఘటన మీర్‌పేట్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. హనుమాన్‌నగర్‌లోని వనజా ఉషోదయా అపార్ట్‌మెంట్‌లో నివసించే నాగేశ్వర్‌రావు(68) టీజీఎస్ఆర్టీసీలో పనిచేసి పదవీవిరమణ పొందారు. కొంతకాలంగా ఆయన మతిమరుపు సమస్యతో బాధపడుతున్నారు. కాగా ఈనెల 22న హెయిర్ కటింగ్ షాప్‌కు వెళ్తున్నట్టు ఇంట్లో చెప్పాడు. బయటకు వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు అన్ని చోట్ల వెతికారు. మూడు రోజులైనా ఆయన ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.



గ్రాడ్యుయేషన్ పట్టా పొందిన విద్యార్థులు

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

● నోబుల్ విద్యా సంస్థల చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి

చాదర్‌ఘాట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని నోబుల్ విద్యా సంస్థల చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని నోబుల్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఆదివారం గ్రాడ్యుయేషన్‌డే, ఫ్రెషర్స్‌డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం రాజేశ్వర్‌రెడ్డి ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఎలా రాణించాలనే అంశంపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్‌పీఎస్ విఠల్, లెక్చరర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏబీవీపీ గ్రేటర్ హైదరాబాద్ సిటీ సెక్రటరీ పృథ్వి తేజ

రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న రూ.8,500 కోట్ల ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ గ్రేటర్ హైదరాబాద్ సిటీ సెక్రటరీ పృథ్వి తేజ డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఈ నెల 28న హైదరాబాద్ నగరాన్ని అష్టదిగ్బంధనం చేస్తామని, ఎమ్మెల్యేలు, మంత్రుల క్యాంప్ ఆఫీసులు ముట్టడిస్తామని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డిని గద్దె దింపే వరకు ఏబీవీపీ పోరాడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు జీవన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజు, సిటీ జాయింట్ సెక్రటరీ నందిని, ఓయూ అధ్యక్ష, కార్యదర్శులు దృహన్, శివ శంకర్, యూనివర్సిటీ నాయకులు అన్వేష్, భువన్, జశ్వంత్ పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న ఆటో డ్రైవర్లు

రామంతాపూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రామంతాపూర్ నవరంగ్ గూడ ఆటో స్టాండ్ వద్ద ఆదివారం గ్యార్మీ వేడుకలు పురస్కరించుకొని సీఐటీయూ అధ్యక్షుడు మొహమ్మద్ గౌస్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ ప్రతి ఏడాది క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు జహంగీర్, ఖలీం, గౌస్ పాషా, మస్తాన్, సల్మాన్, ఖాజా, మొహమ్మద్ ఇబ్బు తదితరులు పాల్గొన్నారు.

సనాతన యోగా వెబ్‌సైట్ ఆవిష్కరణ



వెబ్‌సైట్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

రవీంద్రభారతి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మానసిక ప్రశాంతత, నిత్య జీవన చైతన్యానికి యోగా సాధన మంచి మార్గమని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం జరిగిన యోగా ప్రాముఖ్యత కార్యక్రమంలో సనాతన యోగ వెబ్‌సైట్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అతిథులుగా ప్రముఖ అస్త్రానమీ డాక్టర్ ఆంజనేయులు, గాడిపెల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొని వెబ్‌సైట్ ఆవిష్కరించి మాట్లాడారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగా మంచి సాధనమని అన్నారు. సనాతన యోగా పేరిట తీసుకురావడం గొప్ప విషమన్నారు. ఆన్‌లైన్ ద్వారా సనాతన యోగా శిక్షణ పొందవచ్చని నిర్వాహకులు తెలిపారు.